జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA దినపత్రిక
హైదరాబాద్ ‖సంపుటి:1 ‖ సంచిక: 7 ‖ శనివారం ‖ 6-6-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-



జేడీ చక్రవర్తిపై ఆసక్తికర రంభ వ్యాఖ్యలు

-సినిమా పేజీలో...





# చుక్క నీరు వదులుకోం

బీఆర్ఎస్ పదేళ్ల పాలన, 30 నెలల మా పాలనపై సిద్ధం

కారు పార్టీ నేతలు పొర్లుదండాలు పెట్టినా పాపాలు తీరవు

రూ.22 వేల కోట్ల బడ్జెట్‌లో 8వేల కోట్లు పాలమూరుకే ఖర్చు

వచ్చే ఏడాది 2027 నాటికి పాలమూరు కాలువల పనులు పూర్తి

పాలమూరు ప్రాజెక్టుల పర్యటన సందర్భంగా సీఎం రేవంత్

*ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పచ్చని పంటలతో కళకళలాడే ప్రాంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలోని సాగు, తాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు.*

కొత్తూరు, జూన్ 5: గత రెండు రోజులుగా పాలమూరు ప్రాంతంలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించి న అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, జూరాల, కోయిల్ సాగర్ వంటి కీలక ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో వ్యవసాయ రంగం పూర్తిగా రూపాంతరం తరువాయి 2 వ పేజీలో...



## అమీర్‌పేట్ అగ్నిప్రమాదంపై కవిత ఆగ్రహం

**హైదరాబాద్, జూన్ 5**

అమీర్‌పేట్‌లోని మైత్రివనం ఎదురుగా ఇటీవల అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను తెలం గాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత సందర్శించా రు. ప్రమాదంలో నష్టపోయిన (మిగతా 2వ పేజీలో)



## పేదల కోసం లక్ష ఇళ్లు

ప్రభుత్వ భూముల్లో నిర్మాణం

జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ప్రణాళిక

**హైదరాబాద్, జూన్ 5**

కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను పేదల గృహ నిర్మాణం కోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం (మిగతా 2వ పేజీలో)

## సింగరేణిలో రూ. 1,600 కోట్ల కుంభకోణం!

క్షేత్రస్థాయిలో మాయమైన 40 లక్షల టన్నుల బొగ్గు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ లేఖ

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్

స్పందించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరిక



*సింగరేణిలో భారీ బొగ్గు కుంభకోణం జరిగిందని దీనిపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సంస్థ ప్రకటించిన నిల్వల్లో సుమారు 1,600 కోట్ల రూపాయల విలువైన 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని ఆయన ఆరోపించారు.*

హైదరాబాద్, జూన్ 5:ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ఆయన ఒక లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి వరుస కుంభకోణాలకు కేంద్రబిందువు గా మారిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రి శ్రీరాంపూర్ రామగుండం భూపాలపల్లి ఇల్లందు సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉ న్నట్లు అధికారిక వెబ్ సైట్లో చూపించారు. కానీ ఆయా కోల్ స్టాక్ యార్డుల వద్ద ఆ బొగ్గు నిల్వలు కనిపించకపోవడం వల్ల భారీ తరువాయి 2 వ పేజీలో..



## అమరావతి నుంచి నెల్లూరు వరకు భారీ ఆక్వా కారిడార్!

భారతదేశ బ్లూ ఎకానమీకి ఏపీను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతాం

నేషనల్ సీ ఫుడ్ ఎక్స్ పోర్ట్స్ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన చంద్రబాబు, కేంద్ర మంత్రులు

*భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదేనని, భారతదేశ నీలి విప్లవానికి, ఆర్థిక ప్రగతికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో ఆక్వా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఉద్ఘాటించారు.*

విశాఖపట్నం, జూన్ 05: విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్ఠా త్మకంగా ప్రారంభమైన నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ జాతీయ వర్క్‌షాప్‌నకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదస్సులో కేంద్ర మంత్రులు రాజీవ్ రంజన్ సింగ్, రామ్మోహన్నాయుడు, చిరాగ్ పాశ్వాన్, పీయూష్ గోయల్‌తో పాటు రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ బీదా మస్తాన్ రావు, సీ ఫుడ్ ఎక్స్ పోర్టు తరువాయి 2 వ పేజీలో...

## భారత్‌పై పుతిన్ ప్రశంసలు

విదేశాంగ విధానానికి మద్దతు

ఆర్థిక వృద్ధిపై ప్రశంసలు

ద్వైపాక్షిక బంధాల విస్తరణ



## ఖైదే మిల్లత్‌కు సీఎం విజయ్ నివాళులు

చెన్నై, జూన్ 5 : ఖైదే మిల్లత్ 131వ జయంతి సందర్భంగా తమిళనాడు ముఖ్యమం త్రి ఎస్. జోసెఫ్ విజయ్ ఘనంగా నివాళులర్పి ంచారు. చెన్నైలోని తిరువల్లిక్కేణి ప్రాంతంలో వల్లాజా పెద్ద మసీదు ప్రాంగణంలో ఉన్న ఖైదే మిల్లత్ స్మారక స్థలాన్ని సందర్శించిన ముఖ్య మంత్రి, పూలమాలలు సమర్పించి పుష్పాంజలి ఘటించారు. ఈ తరువాయి 2 వ పేజీలో..



## పుప్పాలగూడలో భారీ ఆపరేషన్.. 200 ఎకరాలకు ఫెన్సింగ్

వేల సంవత్సరాల నాటి చారిత్రక రాతి గుట్టల సంరక్షణ

హైకోర్టు తీర్పుతో రంగంలోకి మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగం

పర్యావరణ దినోత్సవం నాడు ప్రకృతికి హైడ్రా నీరాజనం

భగీరథమ్మ చెరువు పునరుద్ధరణ, పర్యాటక ప్రాంతంగా మార్పు

హైదరాబాద్, జూన్ 05: హైదరాబాద్ మహాన గరంలో సుమారు ముప్పై వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడి హైడ్రా అధికారులు పటిష్టమైన భద్రత కల్పించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారీ ఆపరేషన్ నిర్వహించిన యంత్రాంగం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ ఖాజాగూడ సరిహద్దుల్లో ఆక్రమణలకు గురవుతున్న రెండు వందల ఎకరాల అత్యంత విలువైన భూమి చుట్టూ ఫెన్సింగ్ తరువాయి 2 వ పేజీలో..

# నేటి రాశి ఫలాలు

**మేషం :** ముఖ్యమైన పనులను ప్రారంభించేందుకు అనుకూల సమయం. ప్రారంభించిన కార్యక్రమాల్లో సానుకూల ఫలితాలు లభిస్తాయి. ధర్మనిష్ఠ మీకు గౌరవాన్ని తెస్తుంది. స్థిరమైన ఆలోచనలతో ముందుకు సాగితే సత్ఫలితాలు సాధ్యం అవుతాయి. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం శుభప్రదం.

**వృషభం :** అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. స్థిరమైన నిర్ణయాలతో మంచి ఫలితాలు సాధిస్తారు. బంధువులతో ఆనందంగా గడుపుతారు. నూతన వస్తు లాభం, ప్రయాణ సౌఖ్యం కలదు. శ్రీఆంజనేయస్వామి స్తోత్ర పారాయణం మేలు చేస్తుంది.

**మిథునం :** విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపార రంగాల్లో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. అస్థిర నిర్ణయాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. విష్ణు సహస్రనామ పఠనం శ్రేయస్కరం.

**కర్కాటకం :** మిశ్రమ వాతావరణం ఉంటుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో జాగ్రత్త అవసరం. అధికారులతో ఆచితూచి వ్యవహరించాలి. శాంతంగా ముందుకు సాగితే మేలు జరుగుతుంది. విరోధులను తక్కువగా అంచనా వేయవద్దు. నవగ్రహ ఆరాధన శుభప్రదం.

**సింహం :** వృత్తి, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో అనుకూల ఫలితాలు ఉన్నాయి. తెలివితేటలతో కీలక పనులను పూర్తిచేయగలుగుతారు. చిత్తసౌఖ్యం కలుగుతుంది. మీ మనోధైర్యమే మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. ప్రసన్న ఆంజనేయస్వామి స్తోత్ర పారాయణం శుభప్రదం.

**కన్య :** మిశ్రమ ఫలితాలు సూచిస్తున్నాయి. ప్రారంభించిన పనుల్లో అధిక శ్రమ అవసరం అవుతుంది. మనోబలం తగ్గకుండా చూసుకోవాలి. అవసరమైన సమయానికి డబ్బు అందుతుంది. శ్రీహరి ఆరాధన శుభఫలితాలను ఇస్తుంది.

**తుల :** ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధువుల సహకారం లభిస్తుంది. ఒక శుభవార్త మనోధైర్యాన్ని పెంచుతుంది. సమాజంలో పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. ఎలాంటి పరిస్థితుల్లోనూ దైవారాధన మానరాదు.

**వృశ్చికం :** బంధుమిత్రులతో సంతోషంగా గడుపుతారు. కుటుంబ సభ్యుల సలహాలు అనుకూలిస్తాయి. స్థిరమైన ఆలోచనలు మేలు చేస్తాయి. గణపతి అష్టోత్తర శతనామ పఠనం శుభప్రదం.

**ధనుస్సు :** మీ పనితీరుకు ప్రశంసలు లభిస్తాయి. అధికారుల నుంచి సహకారం ఉంటుంది. ఆర్థిక సంబంధ విషయాల్లో లాభ సూచనలు ఉన్నాయి. గణపతి అష్టోత్తర పఠనం శుభఫలితాలను ఇస్తుంది.

**మకరం :** తోటివారి సహకారంతో ముఖ్యమైన పనిని విజయ వంతంగా పూర్తి చేస్తారు. కొన్ని సంఘటనలు ఉత్సాహాన్ని కలిగిస్తాయి. ఒక శుభవార్త మీ ఇంట ఆనందాన్ని నింపు తుంది. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన శుభప్రదం.

**కుంభం :** ఉద్దైవబలంతో ముఖ్యమైన సమస్య పరిష్కారం అవుతుంది. ఆత్మీయులతో ఆనందంగా గడుపుతారు. వ్యాపార రంగంలో అనుకూల ఫలితాలు ఉంటాయి. చిత్తసౌఖ్యం కలుగుతుంది. ఇష్టదైవ స్తుతి శుభప్రదం.

**మీనం :** దైవబలం బాగుంది. ధర్మబద్ధంగా కృషి చేస్తే లక్ష్యం నెరవేరుతుంది. సమష్టి కృషి విజయాన్ని అందిస్తుంది. కుటుంబ సభ్యుల సహకారం ఉంటుంది. ఇష్టదైవ శ్లోకాలు చదవడం ద్వారా మీలో ధైర్యం పెరుగుతుంది.





## ..అగ్నిప్రమాదంపై కవిత ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారులను పరామర్శించి వారి సమస్యలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా బాధితులు తమకు గత కొంత కాలంగా ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయని అధికారు లకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కవితకు వివరించారు. అనంతరం మీడియా తో మాట్లాడిన కల్వకుంట్ల కవిత, ఈ అగ్నిప్రమాదం అనూహ్యంగా జరిగిన ఘటన కాదని అన్నారు. భవనం వెనుక భాగంలో ఉన్న మెస్ కారణంగా గతంలో కూడా షార్ట్‌సర్క్యూట్ ఘటనలు జరిగినట్లు బాధితులు తెలిపారని చెప్పారు. అగ్నిప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయని మూడు నెలలుగా సంబంధిత అధికారులకు తెలియజేస్తున్నప్పటికీ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని కవిత విమర్శించారు. ప్రమాదం వల్ల సుమారు మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యాపారుల జీవితాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం జరిగిన తర్వాత కూడా అగ్ని మాపక వాహనాలు గంటకు పైగా ఆలస్యంగా చేరుకోవడ ం అత్యంత దురదృష్టకరమని ఆమె అన్నారు. సరైన సమయంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ఉంటే నష్టం చాలా వరకు తగ్గించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన దుకాణాల యజమానుల వద్ద అన్ని అనుమతులు, నిరభ్యంతర ధ్రువపత్రాలు ఉన్నాయని కవిత తెలిపారు. నష్ట పోయిన వ్యాపారులకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. అధికార యంత్రాంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



## .. సీఎం విజయ్ నివాళులు

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా ఖైదే మిల్లత్ దేశానికి, సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. సామాజిక సామరస్యం, ప్రజాసేవ, మైనారిటీల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఖైదే మిల్లత్ జీవిత విశేషాలు, ప్రజా సేవలను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. చరిత్రలో ఖైదే మిల్లత్‌కు ప్రత్యేక స్థానం ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన బాటలో నడవడం ద్వారా సమాజంలో సౌభ్రాతృత్వం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ పుష్పాలు చల్లి నివాళులర్పించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలందరూ మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఖైదే మిల్లత్ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో స్మారక కార్యక్రమాలు నిర్వహించగా, చెన్నైలో జరిగిన ఈ కార్యక్రమం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది.

# చుక్క నీరు వదులుకోం

(మొదటి పేజీ తరువాయి)

చెందుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యం జరిగిందని, భూసేకరణ పూర్తి చేయకుండా పంపులు, లిఫ్టులు, ఇతర పనులపై భారీగా నిధులు ఖర్చు చేశారని విమర్శించారు. దీంతో అనేక ప్రాజెక్టులు మధ్యలోనే నిలిచిపోయాయని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఊపు వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపులతో పాటు కొత్తగా ప్రాజెక్టుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అందులో గణనీయమైన నిధులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులకే కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రతి ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పూర్తి కోసం ఇంకా సుమారు నాలుగు వేల ఎకరాల భూసేకరణ అవసరమని ముఖ్యమంత్రి వివరించారు. రైతులకు న్యాయమైన పరిహారం అందించి భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే రైతులు కోరుతున్న ధర కంటే అధికంగా చెల్లించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారిందని, దానిని త్వరగా అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టుల పనులను గరిష్ట స్థాయిలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పంప్ హౌస్‌లు, లిఫ్టులు, కాలువలు, రిజర్వాయర్ల నిర్మాణాలను

# భారీ ఆక్వా కారిడార్!

మొదటి పేజీ తరువాయి

అసోసియేషన్ల ప్రతినిధులు, స్టార్టప్‌లు, మెరైన్, ఆక్వా కల్చర్ రంగ నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఎగుమతుల్లో ఏపీదే రారాజు.. రూ.28వేల కోట్ల ఆదాయం!**

సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, భారతదేశ సముద్ర ఆహార ఉత్పత్తిలో, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ సాధించిన తిరుగులేని ప్రగతిని గణాంకాలతో సహా వివరించారు. దేశం మొత్తం మీద జరిగే చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా ఉంటే, రొయ్యల ఉత్పత్తిలో ఏకంగా 66 శాతం వాటాతో మన రాష్ట్రమే దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని గర్వంగా ప్రకటించారు. భారతదేశ సముద్ర ఆహార ఎగుమతుల ద్వారా వచ్చే మొత్తం ఆదాయంలో 38 శాతం.. అంటే సుమారు రూ.28,000 కోట్లకు పైగా ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే సమకూరుతోంది. గత పదేళ్లలో మన తరువాయి

ఎగుమతులు 5 శాతం నుండి 70 శాతం వరకు అద్భుత వృద్ధిని సాధించాయి. అయినప్పటికీ, ప్రపంచ సీ-ఫుడ్ వ్యాపారంలో భారత్ వాటా ప్రస్తుతం కేవలం 5 శాతమే ఉంది. దీన్ని మరింత పెంచడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఆక్వా రంగంలో ఏపీ వృద్ధి చెందితే, దేశ ఎగుమతులు కూడా అంతకంతకూ పెరుగుతాయి అని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు చేర్చడమే లక్ష్యంగా ఒక భారీ ప్రణాళికను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఒక సుదీర్ఘమైన ఆక్వా కారిడార్ ను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కారిడార్‌లో పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఒక సమగ్ర ఎకో సిస్టంను ఏర్పాటు చేస్తామన్నారు. అతి తక్కువ పెట్టుబడితో, నాణ్యమైన అత్యధిక ఉత్పత్తిని సాధించడమే మా ప్రభుత్వ లక్ష్యం. దీనికోసం పాండ్ టు పోర్టు.. ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్ అనే నినాదంతో ముందుకు సాగుతాం. 'ఆంధ్రా ష్రింప్.. ఇండియా సీ-ఫుడ్' అనే ఒక శక్తివంతమైన అంతర్జాతీయ బ్రాండ్‌ను మనం నిర్మించాలి అని పిలుపునిచ్చారు.

**కేంద్రానికి పూర్తి సహకారం..**

**పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్!**

ఆక్వా మరియు మత్స్య రంగాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయానికి, ప్రతి చర్యకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి 100 శాతం సహకారం ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు కోసం కేవలం 15 రోజుల్లోనే అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. కాకినాడ పోర్టు ఆధునికీకరణకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం అందిస్తున్న మద్దతును గుర్తుచేశారు. అలాగే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయని.. వారు ఎప్పుడైనా నేరుగా తనను కలవచ్చని లేదా ఫోన్ చేసి రావచ్చని చంద్రబాబు స్పష్టం చేశారు. నేడు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పొలాల్లో తవ్విన చిన్న చిన్న కుంటలు కూడా అద్భుతమైన సంపదను సృష్టిస్తున్నాయని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. 21వ శతాబ్దం నరేంద్ర మోదీది. సరైన సమయంలో దేశానికి దొరికిన అత్యంత సమర్థుడైన నేత ఆయన. భవిష్యత్తులో భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా కృషి చేస్తున్నారు. దేశ శ్రేయస్సు కోసం ఆయనను మనం మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది అని పేర్కొన్నారు.

ఇక సదస్సుకు తాను సైకిల్‌పై వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. సైక్లింగ్ చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు అనవసర ఖర్చులు తగ్గుతాయని సూచించారు.

## పేదల కోసం లక్ష ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

చుడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఈ ఇళ్ల స్థలాల్లో మహిళలకు యాజమాన్య హక్కులు కల్పించి వారి ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పాదాయ,మధ్యతరగతి వర్గాల కోసం లక్ష ఇళ్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో రెండున్నర లక్షల ఇళ్లు కలిపి మొత్తం మూడున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే పరిపాలన అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నగరానికి చాలా దూర ప్రాంతాల్లో గృహాలు నిర్మించడం వల్ల పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే కుటుంబాలు దూర ప్రాంతాలకు వెళ్లలేకపోయాయని పేర్కొన్నారు. ఫలితంగా అనేక గృహాలు ఖాళీగా, వినియోగం లేకుండా మిగిలిపోయాయని అన్నారు. ఈ తరహా పరిస్థితులు పునరావృతం కాకుండా పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవనం సాగించేలా గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ వారికి శాశ్వత నివాస సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా మహిళలకు సొంత ఇంటిపై హక్కు కల్పించడం ద్వారా కుటుంబాల్లో భద్రత, స్థిరత్వం పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. మహిళ సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, భవిష్యత్ తరాల సంక్షేమానికి సొంత ఇల్లు బలమైన పునాదిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇళ్ల స్థలాల్లో మహిళలకు వాటా కల్పించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిపారు. పేదల అవసరాలకు అనుగుణంగా ఇళ్ల నమూనాలను రూపొందించాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రతి ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్‌పై పుతిన్ ప్రశంసలు

జూన్ 5: భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచ రాజకీయాల్లో భారత్ స్వతంత్ర వైఖరితో ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో తమ దేశానికి ఉన్న స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు రష్యా కట్టుబడి ఉందని

(మిగతా 2వ పేజీలో)స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ వార్తా సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై బాహ్య ఒత్తిళ్లు తీసుకురావాలనే ప్రయత్నాలు గతంలో జరిగినప్పటికీ అవి ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని పుతిన్ అన్నారు. ముఖ్యంగా రష్యాతో సంబంధాల విషయంలో భార త్ తన స్వతంత్ర నిర్ణయాలను కొనసాగించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో ఏ దేశంపైనా ఒత్తిడి తీసుకురావడం సరైన విధానం కాదని, అలాంటి చర్యలు ప్రపంచ స్థాయి దౌత్య సంబంధాలను బలహీనపరుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. భారత ఆర్థిక వ్యవస్థపై కూడా పుతిన్ ప్రశంసలు వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తోందని పేర్కొన్నారు. భారీ జనా భా, విస్తృత మార్కెట్, సాంకేతిక రంగంలో పురోగతి కారణంగా భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక శక్తిగా ఎదుగుతోందని ఆయన వివరించారు. దేశంలో నమోదవుతున్న ఆర్థిక వృద్ధి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని అన్నారు. రష్యా-భారత్ మధ్య ఆర్థిక సహకా రం మరింత విస్తరించనున్నట్లు పుతిన్ విశ్వాసం వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు నిరంతరం పెరుగుతున్నాయని, రాబోయే కాలంలో ద్వైపాక్షిక వాణిజ్య విలువ వంద బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధనం, పరిశ్రమలు, సాంకేతికత, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భారత్ వంటి పెద్ద దేశంపై ఒత్తిడి తీసుకురావాలనే ప్రయత్నాలు ఆ చర్యలకు పాల్పడే దేశాలకే ప్రతికూల ఫలితాలను ఇవ్వవచ్చని పుతిన్ హెచ్చరించారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్‌కు ప్రత్యేక స్థానం ఉందని, అలాంటి దేశంతో సంబంధాలను దెబ్బతీయడం అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రభావాలను కలిగిస్తుందని అన్నారు. పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా దేశాల మధ్య సంబంధాలు కొనసాగాలని సూచించారు. భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అంతర్జాతీయ వేదికలపై మరింత ప్రభావవంతమైన పాత్ర పోషిస్తోందని పుతిన్ అభిప్రాయపడ్డారు.

# శ్వేత సంపాదకీయం

**గురువారం 4-6-2026**

## ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యావారణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది.

భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి.

కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

## సింగరేణిలో రూ. 1,600 కోట్ల కుంభకోణం!



కుంభకోణం జరిగిందనే అనుమానాలు బలపడుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. బొగ్గు నిల్వలపై పన్నులు చెల్లించినట్లు రికార్డుల్లో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో నిల్వలు లేకపోవడం వెనుక ఎవరి పాత్ర ఉందో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు.

తనిఖీల్లో అధికారుల తీవ్ర నిర్లక్ష్యం

బొగ్గు నిల్వలను తనిఖీ చేయాల్సిన కేంద్ర బొగ్గు గనుల శాఖ అధికారుల బృందాలు గనులను సందర్శించకపోవడం కాగ్ అధికారులు కూడా ఇప్పటివరకు తనిఖీలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తోందని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తెలంగాణ బొగ్గును పక్కదారి పట్టించాయా అనే అనుమానాలు కార్మికుల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అఖిలపక్ష బృందాన్ని గనుల వద్దకు పంపి వాస్తవాలను వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇటీవల వెలుగులోకి వచ్చిన నైని బొగ్గు గని టెండర్ల కుంభకోణంపై కూడా కేటీఆర్ కేంద్రాన్ని నిలదీశారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధన పేరుతో కొందరికి అనుకూలంగా టెండర్లు కట్టబెట్టే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో టెండర్లను రద్దు చేసినప్పటికీ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు డీజిల్ మరియు పేలుడు పదార్థాల కొనుగోళ్లతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల వినియోగంలోనూ భారీ అవకతవకలు జరిగాయని వివరించారు.

విచారణ లేకపోతే తీవ్ర ఉద్యమం

సింగరేణిలో జరుగుతున్న వరుస అక్రమాలపై వెంటనే సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే కార్మికులతో కలిసి రెండు ప్రభుత్వాలపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ప్రజల ఆస్తిగా భావించే సింగరేణి సంస్థను బలహీనపరిచే ప్రయత్నాలను తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని కేటీఆర్ స్పష్టం చేశారు.



## పుప్పాలగూడలో భారీ ఆపరేషన్.. 200 ఎకరాలకు ఫెన్సింగ్

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసింది. మున్సిపల్ మరియు రెవెన్యూ శాఖల సమన్వయంతో ఈ రక్షణ చర్యలు చేపట్టింది. కేవలం భూమిని ఆక్రమణల నుంచి కాపాడటమే కాకుండా అందులో ఉన్న రెండు వందల యాభై కోట్ల సంవత్సరాల నాటి అతి పురాతన రాతి గుట్టలు గుహలు మరియు ప్రాకృతిక సంపదను హైడ్రా సంపూర్ణంగా సంరక్షించింది.

**దశాబ్దాల పోరాటానికి ఫలితం**

సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధుల సుదీర్ఘ న్యాయ పోరాటానికి హైడ్రా చర్యలతో ప్రతిఫలం దక్కింది. దశాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని కాపాడాలని వారు చేస్తున్న డిమాండ్ మేరకు గతంలోనే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఆ తీర్పు అమలులో జరిగిన జాప్యాన్ని నివారిస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేరుగా రంగంలోకి దిగారు. మున్సిపల్ రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పక్కాగా హద్దులు నిర్ధారించి ఆక్రమణలకు శాశ్వత చెక్ పెట్టారు.

**రికార్డుల పక్కా పరిశీలన**

స్థానిక రెవెన్యూ రికార్డుల ప్రకారం వివిధ సర్వే నంబర్లలో రెండు వందల తొంభై మూడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో హెచ్ఎండీఏకు రాష్ట్ర ప్రభుత్వం రెండు వందల అరవై మూడు ఎకరాలు కేటాయించింది. రెండు గ్రామాల సరిహద్దుల వివాదాలతో అరవై మూడు ఎకరాలు ప్రైవేటు వ్యక్తులవిగా తేలడంతో మిగిలిన రెండు వందల ఎకరాలను అధికారులు రక్షించారు. వివిధ దేవాలయాలకు మరియు దర్గాకు ఐదెకరాల చొప్పున కేటాయించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

పర్యాటక ప్రాంతంగా భగీరథమ్మ చెరువు

ఎంతో ఎత్తుగా సహజ సిద్ధంగా ఉన్న గుట్టలను రక్షించడం పట్ల పర్యావరణవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక స్థలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తీసుకున్న రక్షణ చర్యలను ప్రజలు అభినందిస్తున్నారు. ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తుండటంతో కొండ దిగువ భాగం త్వరలో ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దుకోనుంది.

## యథాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

**ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ**

**రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం**

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి

ముంబై,జూన్5(ఆర్ఎన్ఎ): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం.

ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో

కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది.



## వైభవంగా శ్రీకళ్యావణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

**శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహణ**

తిరుపతి,జూన్5(ఆర్ఎన్ఎ): తిరుపతి సమీపంలోని నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం చక్రస్నానం వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య ఘట్టాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8.15 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణి సమీపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.15 గంటల నుండి 10.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో జరిగిన అన్ని సేవలు సఫలమై, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం చక్రస్నానం నిర్వహించినట్లు ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చక్రస్నానాన్ని దర్శించిన భక్తులు సమస్త పాప విముక్తులై, ఐశ్వర్యాలు, ధనధాన్య సమృద్ధిని పొందుతారని విశ్వాసం. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి పలుకనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్రాయులు, అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు



# మహిళల భద్రతపై అవగాహన

**బాపట్ల, జూన్ 5**

మహిళల భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో బాపట్ల జిల్లా పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో శక్తి బృందాలు జిల్లావ్యాప్తంగా మహిళలు, యువతకు భద్రతా అంశాలపై చైతన్యం కల్పిస్తున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో శక్తి బృందాల సభ్యులు ప్రజలను కలుస్తూ అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలు, భద్రతా జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై వివరాలు అందిస్తున్నారు. మహిళలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని అధికారులు సూచిస్తున్నారు. భయపడకుండా ఫిర్యాదు చేయడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. యువతకు కూడా సామాజిక బాధ్యత, మహిళల పట్ల గౌరవం, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. మహిళల భద్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని అధికారులు తెలిపారు.



# రోడ్డు భద్రతపై అవగాహన

**కడప, జూన్ 5**

రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కడప జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పెండ్లిమర్రి మండల కేంద్రంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెండ్లిమర్రి ఎస్సై తులసి నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. రహదారులపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు.

# వీరంపాలెంలో వైఎస్సార్సీపీ సమావేశం

**తాడేపల్లిగూడెం, జూన్ 5**

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్ మండలం వీరంపాలెం గ్రామంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి వడ్డీ రఘురామ్ నాయుడు పాల్గొని పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు.



గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్దలతో కలిసి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురామ్ నాయుడు మాట్లాడుతూ వీరంపాలెం గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వైఎస్సార్సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం, రక్షణ విషయంలో పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన ప్రోత్సాహం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బూత్ స్థాయి ప్రతినిధులు పార్టీకి బలమైన పునాదిగా నిలుస్తారని వడ్డీ రఘురామ్ నాయుడు అన్నారు. ఒక్క ఓటు కూడా వృథా కాకుండా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

# హెల్మెట్ ధరిస్తేనే భద్రత

**బాపట్ల, జూన్ 5**



జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో బాపట్ల జిల్లా పోలీసులు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రహదారి ప్రమాదాలను తగ్గించడం, ప్రాణనష్టాన్ని నివారించడం లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు "శిరో రక్షా ప్రాణ రక్షా" అనే నినాదంతో పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. హెల్మెట్ కేవలం చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని అధికారులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగినప్పుడు తలకు తీవ్ర గాయాలు కాకుండా కాపాడడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ నాణ్యమైన హెల్మెట్‌ను తప్పని సరిగా ధరించాలని పోలీసులు సూచించారు. వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ వినియోగించాలని తెలిపారు. చిన్ననిర్లక్ష్యం కూడా ప్రాణాంతక పరిణామాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మరణాలు తలకు గాయాలు కావడం వల్లే జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాద సమయంలో ప్రాణాలను రక్షించుకునే అవకాశం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు.

# వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

**కొత్తపేట, జూన్ 5 (మన దీపం):**



రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పేరవరం గ్రామ వైఎస్సార్సీపీ అధ్యక్షుడు దాసరి రామాంజనేయులు, నాయకుడు అత్తిలి సుబ్బారావుతో పాటు సుమారు నలభై మంది కార్యకర్తలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పసుపు కండువాలు కప్పి నాయకులు ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం పనిచేసే లక్ష్యంతోనే తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పనితీరుపై విశ్వాసంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని నాయకులు సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికనాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అనంత అరణ్యానికి కలెక్టర్ మద్దతు

**అనకాపల్లి, జూన్ 5**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చీడికాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన "అనంత అరణ్యం" మొక్కల నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాట్లాడిన కలెక్టర్ విజయ కృష్ణన్, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు చెట్ల పెంపకం అత్యంత అవసరమని తెలిపారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని చెప్పారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమని కలెక్టర్ సూచించారు. ప్రతి వ్యక్తి నాటిన మొక్కను మహావృక్షంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కల సంరక్షణ ద్వారానే పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలు సాకారం అవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో పర్యావరణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా యువతలో చైతన్యం పెరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు. "అనంత అరణ్యం" కార్యక్రమం ద్వారా జిల్లాలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

# ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ

**కోవూరు, జూన్ 5**

విడవలూరు మండలం ఊటుకూరు గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. గ్రామ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలు త్వరితగతిన అందేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్రజల వినతులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని సూచించారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా గ్రామస్థులకు తమ సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభిస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రతి అర్జీని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు.



# మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

**తిరుపతి, జూన్ 5**



